# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 125 ప్రకాశం, బుధవారం 04- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-







## బి జె ఎం ఎస్. కార్మికుల సంక్షేమం







**ఒంగోలు క్రైంకౌంటర్ ప్రతినిది,** అద్దంకి మండలం లోని వైదన గ్రామంలో బి.జె.ఎం.ఎస్ కార్మికుల తో, బందిత కార్మికులసమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో భారతీయ జనతా మజ్దూర్ సంఘ్) అంటే ఏమిటీ ఈ సంస్థ కార్మికుల కోసం ఎలా పనిచేస్తుండో వివరించారు. గ్రామస్తులు వివిధ సమస్యల బి జె ఎం ఎస్ నాయకుల దృష్టికి తీసుక వెళ్లారు .సమస్యలు విన్న తరువాత ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్త బి జె ఎం ఎస్ నాయకులు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో బి జె ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాలి.మధుసూధన్ యాదవ్ మాట్లాడుతూ మా ఈ సంస్థ కార్మికులకు అండగా ఉంటుందని తెలియచేస్తూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ చట్టాలను గురించివివరించారు. ఇండస్ట్రియల్ రిలేషన్ బోర్డ్ డైరెక్టర్ షేక్ సిద్ధాంభి మాట్లాడుతూ కార్మికుల కు చట్ట పరంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన ప్రయోజనాలు వారికి అందేలా చేస్తామని తెలిపారు, బి.జె.ఎం.ఎస్ ఈ దేశంలోనే ఒక అతి పెద్ద కార్మిక సంస్థ అని అంగన్వాడీ వర్కర్ ల కోసం పోరాడుతున్న ఏకైక సంస్థ అని తెలియచేశారు. జిల్లా అధ్యక్షులు పల్లి బోయిన మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ బిజెఎంఎస్ ఉద్యేశం ను, కార్మికుల పక్షాన నిలబడి ఏవిధంగా పోరాటం చేస్తుందో జిల్లా లో అన్ని మండలాల్లో గ్రామాల్లో వివరించి సంఘం యొక్క బలోపేతానికి కృషి చేయాలని తెలియచేశారు.ఈ సమావేశంలో రాష్ట్రఅధ్యక్షులు నాలి.మధుసూదన్ యాదవ్ గారు, ఇండస్ట్రియల్ రిలేషన్ డైరెక్టర్ షేక్ సిద్ధాంభీ సమక్షంలో జిల్లా అధ్యక్షులు మధు యాదవ్ షేక్ ఖాదర్ భీ ని జిల్లా ఉపాధ్యక్షురాలుగా నియమిశీచారు.ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి , అద్దంకి మండల అధ్యక్షులు పుట్టా కొండలరావు షేక్ సైదా , జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌వి హింసా రాజకీయాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 కల్తీ మనుషులు, నకిలీ పార్టీ అయిన వైసీపీకి డ్రామాలు కొత్త కాదని టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని విమర్శించారు. సోమవారం ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆనాడు బాబాయి హత్య కేసు సమయంలో, కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామా ఆడారు. ఇప్పుడు రాష్ట్రంలో అలజడులు సృష్టించటానికి జగన్ డైరెక్షన్‌లో వారి పార్టీ నాయకులు తమ ఇళ్లను తామే తగలబెట్టుకుని నింద వేరే వాళ్లపై వేసే సరికొత్త డ్రామాకు తెరతీశారు. జగన్‌ది హింసాత్మక వైఖరి. లోకేశ్ నాయకత్వంలో నా ఆధ్వర్యంలో జోగి ఇల్లు తగలబెట్టారని వైసీపీ చేస్తున్నది దుష్ప్రచారం మాత్రమే. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు రాజకీయంగా అశాంతి సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతీకార రాజకీయాలకు మేం దూరం' అని చిన్ని పేర్కొన్నారు.

## ఇంటి పన్ను వసూలు లక్ష్యాలను సాధించాలి డిపిఓ ఎం వెంకటేశ్వరరావు



**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,** మండలములోని ఉప్పలపాడు స్వర్ణ గ్రామంను డిపిఓ ఎంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. శానిటేషన్, ఇంటి పన్నులు సర్వేలపై సిబ్బందికి సూచనలను జారీ చేసియున్నారు. తదుపరి మండల ప్రజా పరిషత్ కార్యాలయములో పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల ప్రగతి పై పలు సూచనలను జారీ చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి శంకర రావు , డిప్యూటీవో ఎంపీడివోలు నారాయణరావు రాంబాబు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయండి




**గుడ్లూరు క్రైకౌంటర్ ప్రతినిధి,: ఫిబ్రవరి 3** కేంద్ర ప్రభుత్వం విధించిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, ఆషాడే రోజు పిలుపునిచ్చారు.సమ్మెలోకి వెళుతున్నమని, వైద్య అధికారి డాక్టర్ రమ్య కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆశా వర్కర్లను ప్రభుత్వమే రిక్రూట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని, సెలవులు ఇవ్వాలని తదితర డిమాండ్ల కోసం, ఫిబ్రవరి 12వ తేదీన సమ్మె జరుగుతుందని, సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గుడ్లూరు లో 12వ తేదీన ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కొట్టే వెంకయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ లీడర్లు, పి లక్ష్మి కుమారి, ఎన్ శేషమ్మ, జయలక్ష్మి, జ్యోతి, రాజేశ్వరి, నాగేశ్వరి, మంజుల, సిహెచ్ రాధా, తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులు-ఏవో కె.వి శేషారెడ్డి




**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,** మండలంలోని చుండి రైతుసేవ కేంద్రం లోని అమ్మపాలెం గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమశీ మంగళవారం జరిగింది. మండల వ్యవసాయ అధికారి కె వి శేషారెడ్డి మాట్లాడుతూ రైతులను గ్రామం లోని రైతులందరు రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా సాగు యాజమాన్య పద్ధతులలో మెళుకువలను తెలుసుకొని లాభసాటి వ్యవసాయం చేయాలనీ కోరారు . స్థానిక రైతు వరి పంటను పరిశీలించి ఎరువుల యాజమాన్య పద్ధతులపై తగు సూచనలను వివరించారు. యూరియా వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయము నాకు మారాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ,వ్యవసాయ సిబ్బంది రఘువీర్ యాదవ్ , హరికృష్ణ రెడ్డి , సంతోష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ఎంపీ మాగుంట



**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,**ఢిల్లీలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను వారి కార్యాలయంలోమర్యాద పూర్వకంగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మంగళ వారం కలిసారు.ఆయన వెంట సహచర పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడి తీరుతాం.



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.రాజకీయ కోణం లేదు.. భక్తుల మనోభావాలే ముఖ్యం

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ప్రభుత్వానికి జనసేన పూర్తి మద్దతు

శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఆయన చంద్రబాబుకు స్పష్టం చేశారు. పవిత్రమైన ఆలయ ప్రాభవాన్ని దెబ్బతీసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

ఐక్యంగా వైసీపీ కుట్రలను తిప్పికొడదాం: సత్యకుమార్ యాదవ్

బీజేపీ తరపున మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ విషయంలో కూటమిలో పూర్తి ఏకాభిప్రాయం ఉందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుట్రలను ప్రజల ముందు పెట్టి, క్షేత్రస్థాయిలో వారిని ఎండగట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సమావేశంలో పాల్గొన్న కీలక నేతలు:

ఈ కీలక భేటీలో కూటమిలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.. వీరిలో..

నారా చంద్రబాబు నాయుడు (ముఖ్యమంత్రి)

పవన్ కల్యాణ్ (ఉప ముఖ్యమంత్రి)

నాదెండ్ల మనోహర్(పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి)

నారా లోకేష్(మానవ వనరుల అభివృద్ధి, పాఠశాల విద్య, ఉన్నత విద్య, ఐటీ (ఐ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి)

పయ్యావుల కేశవ్(ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి)

సత్యకుమార్ యాదవ్(ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి)

తిరుమల ఆలయ పవిత్రత, ప్రసాదాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, దోషులను విచారణ ద్వారా బహిర్గతం చేస్తామని కూటమి నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని 1వ బ్లాక్ లో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను క్యాబినెట్ తీసుకుంది.

## పొన్నలూరు లో క్షేత్రదినోత్సవం



**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,**26 వ పొగాకు బోర్డు పరిధిలోని పొన్నలూరులో సిరి - ఎఫ్ సి ఆర్-15 వంగడాల మధ్య ఉత్పత్తి, నాణ్యతలో పోలిక అనే అంశం మీద రైతులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం మంగళవారంజరిగింది. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి వి.శివ కుమార్ ది గ్రేట్ మాట్లాడుతూ అడుగు ఆకులు వొదిలేసి పక్కానికి వచ్చిన వాటిని మాత్రమే రెలచాలి అని అన్నారు. ఆకు అల్లిక సమయం లో టార్పాలిన్ పట్టాలు విడిగా వాడాలి అన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకొని అన్యపదర్థాలను అందులో వేయాలని చెప్పారు. బారన్లో కురోమీటర్ఉపయోగించాలన్నారు. దీనివలన అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

బ్యారెన్ లో క్యురింగ్ సమయంలో తీసుకోవలసిన మెలుకువలు, క్యూరింగ్, గ్రేడింగ్ అప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు,పొగాకులో అన్యాపదర్థాలు కలవకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు సవివరంగా వివరించారు. సిటిఆర్ఐ హెడ్ అనురాధ మాట్లాడుతు శాస్త్ర సాంకేతికత వైపు దృష్టి సాధించాలని సూచించారు. మరియు ప్రస్తుత పరిస్థితులతో పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలును సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ.టి.సి ప్రతినిదులు రత్నం విజయ్ కుమార్ గారు ,జి.పి. ఐ ప్రతినిధి సుబ్బా నాయుడు , పి.ఎస్.ఎస్. శేఖర్ , పొగాకు బోర్డు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అధికారమిచ్చింది ప్రజలకు సేవ చేయడం కోసం అక్రమ అరెస్ట్ లతో దుర్వినియోగం చేయడం కోసం కాదు,

### వైసిపి నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్,



**క్రైమ్ కౌంటర్ న్యూస్.. ... మార్కాపురం జిల్లా.....** రాష్ట్రం లోని టీడీపీ నాయకత్వం లోని కూటమికి ప్రజలు అధికారం ఇచ్చింది సేవ చేయ డం కోసమని ప్రధాన ప్రతిపక్ష నేతలను అక్రమ అరెస్టలు చేసి అధికార దుర్వినియోగం చేయమని కాదని వైసీపీ మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఓ కారణం చూపి వైసీపీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని, ఈ దుర్మార్గపు చర్యలను రాష్ట్ర ప్రజలు గుర్తిస్తూనే ఉన్నారని ఆయన విమర్శించారు. కూటమి సర్కార్ తన తీరును మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ హెచ్చరించారు. మంచి పాలన అందించి తమకు మేలు చేస్తారన్న ఏకైక కారణంతో రాష్ట్ర ప్రజలు కూటమి పార్టీలకు అధికారాన్ని కట్టబెట్టారని, కానీ చంద్రబాబు నాయకత్వంలోని సర్కార్ వైసీపీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడమే కాకుండా వారిఇళ్లపై దాడులు చేయడం ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ అక్రమ అరెస్ట్ లు చేయడం మాని ప్రజలు ఎలా మేలు చేయాలో ఆలోచించాలని ఆయన సూచించారు. లేకపోతే కూటమి సర్కార్ కు ప్రజా కోర్టులో శిక్ష తప్పదని ఆయన స్పష్టంచేశారు.....

## లింగ సముద్రం వైసీపీ అధ్యక్షులు షేక్ షఫీ



**లింగసముద్రం క్రైం కౌంటర్ ప్రతినిధి,**మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు లింగసముద్రం గ్రామం షేక్ షఫీ ను గ్రామ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. సంబంధించిన గ్రామ కమిటీ , అనుబంధ విభాగాలను మొత్తం కమిటీని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కిష్టయ్య, లింగసముద్రం మండల కన్వీనర్ నోటి వెంకటేశ్వర్ రెడ్డి, బేరి వెంకటేశ్వర్లు, గెరపాటి మహేంద్ర,పత్రా అవినాష్, ఎస్.కె జునైద్,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సూపర్వైజర్లు బదిలీలు



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి. నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,** ఐ సిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగనవాడి సూపర్వైజర్లు బదిలీ అయ్యారు. కందుకూరు అర్బన్ సూపర్వైజర్ ఏ సెక్టార్ సూపర్వైజర్ గా ప్రభావతి, బి సెక్టార్ సూపర్వైజర్ గా ఏ సెక్టార్ సూపర్వైజర్ ను షేక్ షకీలా బదిలీపై వెళ్లారు. అర్బన్ బి సెక్టర్ సూపర్వైజర్ లక్ష్మీ దేవమ్మ ను రూరల్ సెక్టార్ 2 కొండముడుసు పాలెం నియమించారు. ఇప్పటివరకు అక్కడ పనిచేస్తున్న సూపర్వైజర్ ప్రభావతిని కందుకూరు అర్బన్ ఏ సెక్టార్ సూపర్వైజర్ గా బదిలీపై వెళ్లారు. ఆయా శాఖ అధికారులనుంచి ఉత్తర్వులు వెలువడ్డాయనీ కందుకూరు ప్రాజెక్ట్ సిడిపిఓ ఉ షారాణి తెలియజేశారు.

## రామయ పట్నం పోర్టును ప్రభుత్వ ప్రతినిధులు



**ఒంగోలు క్రైశీకౌంటర్ ప్రతినిధి,**రామాయపట్నం పోర్టును సింగపూర్ నుంచి వచ్చిన ప్రభుత్వ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. అమరావతి ఎకనామిక్ రీజియన్ లో భాగంగా ప్రకాశం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చారు. ఇందులో భాగంగా తీర ప్రాంతంలో కీలకమైన ఈ పోర్టు నిర్మాణ పురోగతిని పరిశీలించి నిర్వహణ సామర్థ్యం, లభించే ఉపాధి అవకాశాలు, విస్తరణ ప్రణాళికలు, దీని ఆధారంగా చుట్టుపక్కల జరిగే అభివృద్ధి, పోర్టుకు అనుసంధానమైన రోడ్డు, రైలు రవాణా సౌకర్యాల గురించి పోర్టు అధికారులతోనూ, భూ సేకరణ అధికారులతో చర్చించారు. ఆ వివరాలను అధికారులు తెలియజేయగా సింగపూర్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బృందంలో సింగపూర్ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డ్ తరఫున ఎకనామిక్ కన్సల్టెంట్ చువా ( రిటైర్డ్ ), సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్ప్రైస్ తరఫున థాయ్, నిషా, వాణిజ్య - పరిశ్రమల శాఖ తరఫున ఫ్రాన్సిస్ ఉన్నారు. ఆయన జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ.బి.చిన ఓబులేసు, కందుకూరు సబ్ కలెక్టర్.హిమ వంశీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, ఏపీ మ్యారీ టైం బోర్డు ఈ.ఈ. శివరాం, పోర్టు టెక్నికల్ డైరెక్టర్ సుధాకర్ రావు, తదితర అధికారులు ఉన్నారు.

## విద్యాశాఖ మంత్రి లోకేష్ ను కలిసిన ఎంపీ మాగుంట

**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను ఢిల్లీ పర్యటనలో భాగంగా మర్యాదపూర్వకంగా ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలిశారు. ఆయన వెంట పలువురు పార్లమెంట్ సభ్యులు ఉన్నారు



## విద్యార్థులకు నులుపురుగు మాత్రలను మింగించాలి

### వైద్యాధికారి ఎస్. సిద్ధప్ప




**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,**ఆషాడే స్పర్శ కార్యక్రమము గురించి గ్రామ ప్రజలకు వైద్య అధికారి ఎస్ .సిద్ధప్ప తెలియజేశారు. స్థానిక పి హెచ్ సి అవగాహన వారోత్సవాల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి నులు పురుగుకార్యక్రమము ద్వారా స్కూల్ విద్యార్థులకు మాత్రలను మింగిస్తామని అన్నారు. సూపర్వైజర్ కే పద్మావతి, సి హెచ్ ఓ శివరామయ్య, ఎంఎల్ హెచ్పి , ఆరోగ్య కార్యకర్తలు, ఆశ లు పాల్గొన్నారు.





**క్రైమ్ కౌంటర్ న్యూస్..... మార్కాపురం జిల్లా....**మార్కాపురం బాయ్స్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు సంఘం 86 87 బ్యాచ్ తరపున పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామంలో గవర్నమెంట్ స్కూల్ నందు పదో తరగతి చదువుకుంటున్నటువంటి బాల బాలికలకు 50 మందికి మరియు కలనూతల గ్రామంలో గవర్నమెంట్ స్కూల్ నందు 20 మందికి పదవ తరగతి స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ అధ్యక్ష కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి అన్నారాము ఈ స్టడీ మెటీరియల్ ద్వారా మీరు బాగా చదివి మంచి మార్కులతో పాస్ కావాలని చెప్పేసి తెలియజేసినారు ఈ కార్యక్రమంలో తడికమళ్ళ శ్రీనివాసరావు ,అనుముల ఆంజనేయులు, అక్కల నారాయణ, సహచర మిత్రులు కందుల బలరాం రెడ్డి ,సాదుల యోగి రెడ్డి, సుంకేసుల ఉపాధ్యాయులు హెచ్ఎం , అలాగే కలనూతల హెచ్ఎం ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు ....

## మట్టి నమూనా పరీక్షల ప్రదర్శన క్షేత్రం



**వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,** రైతుసేవ కేంద్రం పరిధిలోని బండివారిపాళెం లో సూక్ష్మ పోషకాలు డెమో లు మండల వ్యవసాయ అధికారి కె వి శేషారెడ్డి మంగళవారం నిర్వహించారు . మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా గ్రామము లోని పొలాలలో జింక్ ధాతువు లోపాన్ని గుర్తించారు. దాన్ని అధిగమించడానికి చేయవల్సిన పద్ధతులను వివరించారు. చిలటెడ్ జింక్, వేప పిండి , బయో ఫర్టిలైజర్ ల వాడకల ద్వారా ఈలోపాన్ని ఎలా అధిగమించాలో డెమోల ద్వారా రైతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం , సొసైటీ ప్రెసిడెంట్ గుత్తా మహేశ్వరావు ,వలేటి మధు, వలేటి నరసింహం ,కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం(మాజీ సొసైటీ ప్రెసిడెంట్), గుత్తా తిరుపతయ్య , గుత్తా కొండయ్య , మన్నం మాధవ, కొంక రమేష్ , పరిటాల భాస్కర్ , కాకుమాను హర్ష , కాకుమాను మాల్యాద్రి ,వలేటి వెంకటేశ్వర్లు, బండివారిపాలెం మొత్తం రైతులు , వడ్డిపాలెం రైతులు, వ్యవసాయ సిబ్బంది హరికృష్ణ రెడ్డి , సంతోష్ పాల్గొన్నారు.



# స్టేట్ ఫస్ట్ సాధించిన బి ఆర్ ఆక్స్ ఫోర్డ్ స్కూల్ విద్యార్థి

క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,విజయవాడ ఇందిరా గాంధీ ఫుట్ బాల్ స్టేడియంలో జరిగిన "ఖేలో ఇండియా ఎన్టిపిసి అమరావతి సిటీ ఓపెన్ ఆర్చరీ టోర్నమెంట్" అండర్-15 ఇండియన్ విభాగంలో ప్రకాశం జిల్లా తరపున పాల్గొన్న కందుకూరు బిఆర్ ఆక్స్ఫర్డ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె వి సౌరీష్ స్టేట్ ఫస్ట్ సాధించాడు.ఈ సందర్భంగా బి.ఆర్. ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ.. ఇలాంటి విజయాలు విద్యార్థులలో పట్టుదలను పెంచి ఉన్నత స్థానానికి చేరుకోవడానికిదోహద పడతాయ న్నారు.డైరెక్టర్ బాల భాస్కరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తితో ఉంటే ఆత్మవిశ్వాసంతో చదువులోనూ రాణించగలరని పేర్కొన్నారు. స్టేట్ ఫస్ట్ సాధించిన సౌరీష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి.నరేంద్ర బాబు,పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా మారనుంది

భారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారం.




క్రైం కౌంటర్ న్యూస్ : అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారంపై సుప్రీంకోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏపీ ప్రభుత్వానికి వివరణాత్మక నివేదిక సమర్పించింది. 2019-2024 మధ్య కాలంలో జరిగిన ఘోర తప్పిదాలు, నిబంధనల ఉల్లంఘనలు, ఉద్దేశ్యపూర్వక మోసాలను వివరిస్తూ 11 పేజీల లేఖలో తన దర్యాప్తు అంశాలను పేర్కొంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

నివేదిక.. కీలక అంశాలు..

టెండర్ నిబంధనల మార్పు: 2020లో ఎటువంటి అధ్యయనం, శాస్త్రీయత లేకుండా టెండర్ కండిషన్లు మార్చారు. దీంతో అర్హత లేని కంపెనీలకు టెండర్‌లో పాల్గొనే అవకాశం ఇచ్చారు. 2020-2023 మధ్య ఈ అర్హత లేని కంపెనీలే కల్తీ నెయ్యి సరఫరా చేశాయి.

నిబంధనల రిలాక్సేషన్: నెయ్యి సరఫరా సంస్థలకు కనీసం రూ.250కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధనను రూ.150 కోట్లకు తగ్గించారు. డైరీ రంగంలో 3 ఏళ్ల అనుభవం ఉండాలన్న నియమాన్ని ఏడాదికి కుదించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సేకరణ నిబంధనను పూర్తిగా తొలగించారు. అలాగే, 12 టన్నుల వెన్న తీయాల్సిన నిబంధనను 8 టన్నులకు తగ్గించారు.

టీటీడీ పర్చేజ్ కమిటీ పాత్ర: పర్చేజ్ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా చెవిరెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి పాత్రను నిర్దిష్టంగా ప్రస్తావించింది. టెండర్ కండిషన్లు మొదలుకుని నెయ్యి సరఫరా వరకు ప్రతి అంశంలో ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంది.

అధికారుల బాధ్యత: మొత్తం ప్రక్రియ తప్పుదారి పట్టడంలో ఖీూడజూూ బాలాజీ, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ బాధ్యులని పేర్కొంది. అర్హత లేని డైరీల నుంచి కల్తీ నెయ్యి కొనుగోలు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని నివేదికలో తెలిపారు.

పరీక్షలు: కల్తీ నెయ్యిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో 2022 మే 25న సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కు శాంపిల్స్ పంపారు. పరీక్షల్లో వైష్ణవి డైరీ, బోలేబాబా డైరీల నుంచి వచ్చిన నెయ్యి కల్తీ అయినట్టు నిర్ధారణ అయింది. అయితే, అడిషనల్ ఈవో ధర్మారెడ్డి సహా అధికారులు ఈ నివేదికను పరిగణలోకి తీసుకోలేదు.

వరుస మోసాలు: వరుస తప్పిదాలు, మోసాలతో కల్తీ నెయ్యి సరఫరాకు అనేక దశల్లో టీటీడీ పెద్దలు సహకరించారని తన దర్యాప్తులో తేల్చింది.

# ఏపీ అభివృద్ధి లక్ష్యంగా ఢిల్లీకి మంత్రి నారా లోకేశ్: కేంద్ర మంత్రులతో కీలక భేటీలు!



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 03 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరులు, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు దేశ రాజధాని ఢిల్లీకి పయనం కానున్నారు. అమరావతిలో జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఆయన తన పర్యటనను ప్రారంభించనున్నారు. షెడ్యూల్ ప్రకారం, మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టుల సాధన దిశగా ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఢిల్లీ చేరుకున్న అనంతరం, రేపు ఉదయం లోకేశ్ పార్లమెంట్ భవనానికి వెళ్లి అక్కడ పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. రాష్ట్రంలోని విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలు, ఐటీ రంగ విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఆయన కేంద్రానికి వివరించే అవకాశం ఉంది. అలాగే ఏపీలో నిరుద్యోగితను తగ్గించేందుకు అవసరమైన కేంద్ర సహకారాన్ని కోరనున్నారు. ఈ భేటీలలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా చర్చలు సాగనున్నాయి.రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర పథకాల అమలుపై కూడా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా ఐటీ హబ్‌ల ఏర్పాటు మరియు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతానికి కేంద్ర మంత్రుల నుంచి సానుకూల హామీలను పొందే ప్రయత్నం చేయనున్నారు. కొత్త ప్రభుత్వ ప్రాధాన్యతలను కేంద్రానికి వివరించి, పెట్టుబడుల ఆకర్షణలో కేంద్రం తోడ్పాటును ఆయన కోరనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు ముగించుకున్న అనంతరం, రేపు అర్ధరాత్రికి మంత్రి నారా లోకేశ్ తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. పర్యటన వివరాలను మరియు కేంద్రం నుంచి లభించిన స్పందనను ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నివేదించే అవకాశం ఉంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో జరుగుతున్న ఈ మెరుపు పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో మరియు పాలనలో కీలక మార్పులు వస్తాయని ఆశిస్తున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

# టీటీడీ కల్తీ నెయ్యి కేసు.. ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం..



క్రైం కౌంటర్ న్యూస్ : అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదం నెయ్యిలో రసాయనాల మిశ్రమంపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సిట్ నివేదికలోని లోపాలను సరిచేసి, అసలు సూత్రధారులను కనుగొనేందుకు కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. అప్పట్లో పర్చేస్ కమిటీకి సభ్యులు కాని భూమన కరుణాకర్ రెడ్డిని ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచారని సీఎం చంద్రబాబుకు మంత్రులు వివరించారు. అయితే, ఆనాడు కమిటీ సభ్యులుగా ఉన్న తనను, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని పిలవలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. రసాయనాల మిశ్రమం కలిసిన లడ్డూలను అయోధ్యకు కూడా పంపారని కేబినెట్‌లో అధికారులు పేర్కొన్నారు. నెయ్యి టెండర్ నిబంధనలను మార్చడంపైనా మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్ దక్కించుకున్నారని, టెండర్ నిబంధనలను మార్చినప్పటికీ ఈఓగా ఉన్న సింఘాల్ అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంపై పలువురు మంత్రులు ప్రశ్నలు లేవనెత్తారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ నివేదికలో నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా పట్టించుకోకపోవడంపై చర్చించారు. అప్పటి అధికారులు బాలాజీ, సుబ్రహ్మణ్యం దానిని పక్కన పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌డీడీబీ నివేదికలో యానిమల్ ఫ్యాట్ ఉందని తేలిందని, అదే విషయాన్ని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రులు తెలిపారు. సిట్ నివేదికలో కొంతమంది పేర్లు పేర్కొన్నప్పటికీ, చివరి ఫైండింగ్స్‌లో వాటిని పేర్కొనకపోవడంపై చర్చ జరిగింది. ఈ లోపాలన్నింటిపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించాలని కేబినెట్ నిర్ణయించింది. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదికను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించింది.టెండర్ ప్రక్రియలో లోపాలపై దృష్టి సారించాలని కమిటీకి మంత్రిమండలి సూచించింది. సహకార డెయిరీలను పక్కన పెట్టేందుకు పథకం రూపొందించారని కేబినెట్ పేర్కొంది. సహకార డెయిరీలను పక్కన పెట్టడం ద్వారా బోగస్ డెయిరీలను రంగంలోకి తీసుకువచ్చారని అధికారులు వివరించారు. దీనిపైనా ఎంక్వైరీ కమిటీ దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. అడ్వకేట్ జనరల్, సీనియర్ అధికారుల అభిప్రాయాలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డి పాత్ర గురించి సిట్ నివేదికలో ఏమైనా పేర్కొన్నారా? అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఛార్జ్‌షీట్‌లో యానిమల్ ఫ్యాట్ ఉందని పేర్కొన్నారా? అని కూడా పవన్ అడిగారు. ఛార్జ్‌షీట్‌లోని 35వ పేజీలో స్పష్టంగా పేర్కొన్నారని పవన్‌కు చెప్పారు అధికారులు. అసలు సూత్రధారులను వెంటనే తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. సిట్ నివేదికలో లోపాలు ఉన్నాయని, అసలు సూత్రధారులను బయటకు తీసుకురాలేకపోయిందని మంత్రులు పేర్కొన్నారు. అందువల్ల వెంటనే అసలు సూత్రధారులపై ఫోకస్ పెట్టాలని మంత్రులు చెప్పారు. ఈ విషయాలను బహిర్గతం చేసేందుకే కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే ఎవరిపై చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# అలాగైతే ఎమ్మెల్యేలు, ఎంపీలు, పీఏసీ సభ్యులు ఎందుకు: పవన్



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 03 పదవులిచ్చింది అనుభవించడానికి కాదు.. పని చేయడానికని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. లడ్డూ వ్యవహారంపై ఇంత రాద్ధాంతం జరుగుతున్నా పార్టీ నేతలెవరూ మాట్లాడడం లేదని ఆక్షేపించారు. వైసీపీ దుష్ప్రచారాలను ఎందుకు తిప్పికొట్టడం లేదని నిలదీశారు. 'ప్రతి అంశంపై నేనే మాట్లాడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు, పీఏసీ సభ్యులు ఎందుకు' అని ప్రశ్నించారు. వైసీపీ ట్రాప్‌లో పడొద్దని జనరల్ బాడీ సమావేశంలో స్పష్టం చేశారు. జనసేన.. చాలా మంది రక్తం చిందించి.. వారు తిన్న దెబ్బలపై నిలిచిన పార్టీ అని.. వారి త్యాగాలను మనం గుర్తుంచుకోవాలని సూచించారు. కొందరు నేతల పేర్లు ప్రస్తావించి మరీ క్లాస్ తీసుకున్నారు. పరోక్షంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ప్రతిఒక్కరూ తమ వ్యక్తిగత వ్యవహారాలపై జాగ్రత్తగా ఉండాలని, వారి వల్ల పార్టీకి నష్టం కలిగిస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. 'ఎవరు ఏం చేస్తున్నారో నేనొచ్చి చూడను కదా! ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిని పార్టీకి ఆపాదించడం కరెక్టు కాదు. నాయకులు ఏదైనా తప్పు చేస్తే పార్టీపరంగా విచారణ చేస్తాం. తప్పుందని తేలితే యాక్షన్ తీసుకుంటాం. ఇలాంటి విషయాల్లో పార్టీకి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత మీదే' అని చెప్పారు. జనసేన నాయకులు కూటమి ధర్మాన్ని పాటించాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయుల్లో కూటమి సమావేశాల్లో పాల్గొనాలన్నారు. టీడీపీ నాయకులు సమావేశాలకు పిలిస్తే వెళ్లి, అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవాలని.. కానీ ఆ పార్టీ నాయకుల వ్యక్తిగత సమావేశాల్లో పాల్గొనవద్దని.. దూరంగా ఉండాలని సూచించారు.

మనం కేవలం పొత్తులోనే ఉన్నామన్నది గుర్తుంచుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జోక్యం చేసుకుని.. ఆయా పార్టీల సోషల్ మీడియా టీమ్ బలంగా ఉందని చెప్పారు. పవన్ స్పందిస్తూ.. సోషల్ మీడియా పరంగా మనం కూడా బలంగానే ఉన్నామని.. మీరు గట్టిగా మాట్లాడితే అదే ప్రచారంలోకి వస్తుందని తెలిపారు. 'సోషల్ మీడియా గెలుపోటములను నిర్ణయించదు. మన పార్టీపై వచ్చిన నెగిటివ్ న్యూస్‌ను మనమే వైరల్ చేయడం వల్ల దానికి బలం చేకూరుతోంది. మనం ఆ పద్ధతి మార్చుకోవాలి' అని సూచించారు.

నాగబాబుపైనా సీరియస్ కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, తన అన్న, ఎమ్మెల్సీ నాగబాబుపై పవన్ కొంత సీరియస్ వ్యాఖ్యలు చేశారు. కాకినాడ ఎంపీని ఉద్దేశించి.. 'మీకు లండన్ టూర్లకు వెళ్లేందుకు సమయం ఉంది.. కానీ పవిత్రమైన తిరుపతి లడ్డూ అంశంపై మాట్లాడడానికి టైమ్ లేదా' అని నిలదీశారు. అమ్మాయిల వస్త్రధారణపై మాట్లాడడం, సోషల్ మీడియాలో స్పందిస్తున్న నాగబాబు.. తిరుమల లడ్డూ వ్యవహారంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. 'సోషల్ మీడియాలో, బహిరంగంగా పార్టీ గురించి, నా గురించి అనేక ఆరోపణలు చేస్తున్నారు. కానీ ఎవరూ వీటిని సీరియస్‌గా తీసుకోవడం లేదు, కౌంటర్ చేయడం లేదు. ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి' అని స్పష్టంచేశారు.

# వంగవీటికి, రాంబాబుకు పోలికే లేదు: మంత్రి కొల్లు



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 'మాజీ సీఎం జగన్ డైరెక్షన్‌లోనే అంబటి రాంబాబు, జోగి రమేశ్, పేర్ని నాని పరుష పదజాలం తో టీడీపీ నాయకులను తిడుతున్నారు.' అని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. 'సీఎం చంద్రబాబును సైతం ఇష్టారాజ్యంగా దుర్భాషలాడిన అంబటి రాంబాబును రెండో వంగవీటి రంగాగా పోల్చడం విడ్డూరంగా ఉంది. వంగవీటి రంగాకు, అంబటి రాంబాబుకు ఏవిధమైన పోలికా లేదు. పందికొక్కులా పేదల బియ్యాన్ని బొక్కేసిన పేర్ని నాని నీతులు వల్లిస్తున్నాడు. కల్తీ మద్యంతో వేలాది ప్రజల ప్రాణాలు తీసిన జోగి రమేశ్ తాను బీసీనని చెప్పుకోవడం సిగ్గుచేటు' అని మంత్రి కొల్లు అన్నారు.

# సినిమా



## పారిశుద్ధ్య కార్మికురాలిని ఇంటికి పిలిపించి మరీ గోల్డ్ చైన్ ఇచ్చిన రజనీకాంత్.

కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. చెన్నై మహానగర పాలకసంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మను ఇంటికి పిలిచి మరీ సత్కరించారీ సీనియర్ హీరో. ఆమె నిజాయతీని మెచ్చుకోవడంతో పాటు ఒక బంగారు గొలుసును కానుకగా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. పద్మ చెన్నై నగరంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. ఇటీవల ఆమెకు 45 తులాల బంగారం దొరికింది. ప్రస్తుతమన్న మార్కెట్ లో గోల్డ్ రేట్స్ చూసి వేరొకరైతే ఆ బంగారాన్ని తమ వద్దే ఉంచుకునేవారు. కానీ నిజాయతీ గల పద్మ ఆ పని చేయలేదు. తనకు దొరికిన ఆ బంగారాన్ని వెంటనే పోలీసులకు అప్పగించింది. దీంతో ఆమెపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. పద్మ నిజాయతీని మెచ్చుకుంటూ అందరూ ఆమెను మెచ్చుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న తలైవా రజనీకాంత్ కూడా పద్మను ఇంటికి పిలిపించారు. ఆమెతో ఆప్యాయంగా మాట్లాడారు. ఘనంగా సన్మానం చేసి ఒక బంగారపు గొలుసు గిఫ్ట్‌గా అందించారు. సూపర్ స్టార్ స్వయంగా తనను ఇంటికి పిలిపించి సన్మానించడంతో పద్మ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. పద్మతో పాటు ఆమెను ఘనంగా సత్కరించిన రజనీకాంత్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా పద్మ నిజాయతీకి ప్రతీకగా ఆమెకు భారత తపాలా శాఖ ఇటీవలే అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించింది. ఇక తమిళనాడు ప్రభుత్వం ఆమెను అభినందిస్తూ రూ.లక్ష నగదు బహుమతిని అందించింది





## నిద్ర పట్టడం లేదా? కీళ్లు నొప్పులుగా ఉన్నాయా?

అశ్వగంధ కేవలం ఒక మూలిక మాత్రమే కాదు, అది శరీరంలోని హార్మోన్లను క్రమబద్ధీకరించే ఒక శక్తివంతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే కార్టిసాల్ నియంత్రణ నుండి, పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడం వరకు ఇది ఎంతో మేలు చేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం, యాలకులు కలిపి తయారు చేసే ఈ టీ రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల్లోనూ సాటిలేనిది. ఈ అద్భుత టీ తయారీ విధానం దాని వల్ల కలిగే షాకింగ్ హెల్త్ బెనిఫిట్స్ గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

అశ్వగంధ టీ వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు:

రోగనిరోధక శక్తి : చలికాలంలో మారుతున్న సీజన్లలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి ఇది శరీరానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది.

ఒత్తిడి ఆందోళన: శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్‌ను ఇది అదుపులో ఉంచుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత చేకూరి, ఆందోళన తగ్గుతుంది.

బరువు నియంత్రణ: అశ్వగంధ టీ శరీర మెటబాలిజంను (జీవక్రియ) వేగవంతం చేస్తుంది. దీనివల్ల కొవ్వు నిల్వలు కరిగి, బరువు తగ్గడం సులభమవుతుంది.

కీళ్ల నొప్పులు: ఇందులోని 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' గుణాలు ఆర్థరైటిస్ మరియు కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. కీళ్లలో దృఢత్వాన్ని తగ్గించి నడకను సులభతరం చేస్తుంది.

మంచి నిద్ర: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

అశ్వగంధ టీ తయారీకి కావలసినవి:

అశ్వగంధ పొడి (అర చెంచా), దాల్చిన చెక్క పొడి, అల్లం తురుము, యాలకులు, తులసి ఆకులు రుచికి తగినంత బెల్లం.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. అశ్వగంధ టీని ప్రారంభించే ముందు గర్భిణీలు లేదా ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి.



## పసుపు పాలు తాగుతున్నారా?

భారతీయ ఇళ్లలో రాత్రి పడుకునే ముందు పసుపు పాలు తాగడం అనేది ఒక ఆచారం. జలుబు చేసినా, ఒళ్లు నొప్పులుగా ఉన్నా, రోగనిరోధక శక్తి పెంచుకోవాలన్నా మనకు గుర్తొచ్చే మొదటి చిట్కా ఇదే. అయితే మనలో చాలామంది పసుపు పాలు తయారు చేసేటప్పుడు ఒక కీలకమైన పొరపాటు చేస్తున్నారని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ ఒక్క తప్పు వల్ల పసుపులోని గుణాలు శరీరానికి అందకుండా పోతున్నాయి. పసుపులో కర్క్యుమిన్ అనే అద్భుతమైన పదార్థం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. అయితే కర్క్యుమిన్‌కు ఒక బలహీనత ఉంది. ఇది మన రక్తంలో అంత సులభంగా కలిసిపోదు. మనం పసుపును కేవలం పాలతో కలిపి తాగితే అందులోని కర్క్యుమిన్ శరీరానికి పూర్తిగా అందదు. పసుపు పాలు తయారు చేసేటప్పుడు అందులో చిటికెడు మిరియాల పొడి తప్పనిసరిగా వేయాలి. మిరియాల్లో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది పసుపులోని కర్క్యుమిన్‌ను శరీరం గ్రహించే శక్తిని ఏకంగా 2,000% పెంచుతుంది. అంటే మీరు మిరియాలు వేయకుండా పసుపు పాలు తాగితే, మీరు ఆశించిన ఆరోగ్య ప్రయోజనాలు మీకు అందవు.

కర్క్యుమిన్ కొవ్వులో కరుగుతుంది. కాబట్టి పాలలో చిటికెడు నెయ్యి లేదా కొబ్బరి నూనె వేస్తే అది వేగంగా శరీరానికి అందుతుంది. తెల్ల చక్కెర ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పసుపు పాలలో సహజమైన తీపి కోసం బెల్లం లేదా తేనె వాడటం మంచిది. ప్యాకెట్ పసుపు కంటే పసుపు కొమ్ములను దంచి వాడితే దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. రాత్రి పూట పసుపు పాలు తాగడం వల్ల ఒత్తిడి తగ్గి గాఢ నిద్ర పడుతుంది. కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులను తగ్గించడంలో ఇది కీలకంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసి చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. పసుపు పాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పసుపు పాలు ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ.. అతిగా తాగడం వల్ల వేడి చేసే అవకాశం ఉంటుంది. అలాగే గర్భిణీలు, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు డాక్టర్ సలహా తీసుకోవడం ఉత్తమం.

## వినాశకాలే విపరీత బుద్ధి..

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ తీసుకున్న మొండి నిర్ణయంపై భారత క్రికెట్ దిగ్గజం, 1983 వరల్డ్ కప్ హీరో కపిల్ దేవ్ నిప్పులు చెరిగారు. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల నష్టపోయేది భారత్ కాదు, పాకిస్థానేనని ఆయన హెచ్చరించారు. ఈ నిర్ణయం పాక్ క్రికెటర్ల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ -- పాక్ మ్యాచ్‌పై జరుగుతున్న రచ్చపై కపిల్ దేవ్ ఘాటుగా స్పందించారు. "మీరు కేవలం ఒక మ్యాచ్‌ను బహిష్కరించడం లేదు, పాకిస్థాన్ క్రికెటర్ల మొత్తం ఒక తరాన్ని నాశనం చేస్తున్నారు" అని ఆయన హెచ్చరించారు. పాకిస్థాన్‌లో అద్భుతమైన టాలెంట్ ఉందని, కానీ బోర్డు తీసుకునే ఇలాంటి రాజకీయ నిర్ణయాల వల్ల యువ ఆటగాళ్ల కెరీర్లు బుడగలా పేలిపోతాయని కపిల్ అన్నారు. రాజకీయాలు, ఈగోల కోసం క్రీడలను బలి చేయడం ఏమాత్రం తగదని సూచించారు.

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు వైఖరిని తప్పుబడుతూ కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఒక వ్యక్తి అహంకారం దేశం కంటే లేదా ఆట కంటే పెద్దది కాకూడదు. ఆటగాళ్లకు ఆడటం ఇష్టం లేకపోతే వారు నేరుగా చెప్పాలి, అంతే కానీ బోర్డు ఒత్తిడితో ఆడబోమని చెప్పడం దేశ ప్రతిష్టను దిగజార్చడమే" అని పేర్కొన్నారు. పాక్ ఆటగాళ్లు తమ గళాన్ని వినిపించాలని, బోర్డు నిర్ణయాలకు బలి కావొద్దని ఆయన కోరారు.

ఒకవేళ పాకిస్థాన్ భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, ఐసీసీ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని కపిల్ హెచ్చరించారు. "దీర్ఘకాలంలో పాకిస్థాన్‌ను ఎవరూ మిస్ అవ్వరు. అభిమానులు వేరే మ్యాచ్‌లను చూస్తారు, ప్రపంచం ముందుకు సాగిపోతుంది. కానీ పాకిస్థాన్ మాత్రం అంతర్జాతీయ క్రికెట్‌లో ఏకాకిగా మిగిలిపోతుంది" అని ఆయన విశ్లేషించారు. ఐసీసీ నిబంధనల ప్రకారం ప్రభుత్వ జోక్యం ఉంటే సభ్యత్వం రద్దు చేసే అవకాశం కూడా ఉంటుందని గుర్తు చేశారు.

బంగ్లాదేశ్ జట్టు తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని కోరినప్పుడు ఐసీసీ తిరస్కరించింది. దీనికి నిరసనగా పాక్ ప్రభుత్వం తమ జట్టు భారత్‌తో ఆడదని ప్రకటించింది. అయితే, ఇప్పటికే భారత్-పాక్ మ్యాచ్ శ్రీలంకలోనే జరుగుతున్నప్పుడు, పాక్ బహిష్కరించడం వెనుక ఎలాంటి తర్కం లేదని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. ఇది కేవలం పాక్ యువ క్రికెటర్ల కలలను సమాధి చేయడమేనని ఆయన కుండబద్దలు కొట్టారు.



## మారిన క్రికెట్ రూల్స్.. బంతి సైజు కూడా

క్రికెట్ నిబంధనలను రూపొందించే అత్యున్నత సంస్థ మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ 2026 ఏడాదికి గానూ సంచలన నిర్ణయాలు తీసుకుంది. ఆటలో మరింత పారదర్శకత, ఉత్కంఠను పెంచేందుకు టెస్ట్ క్రికెట్‌తో పాటు మహిళల క్రికెట్‌లోనూ కీలక మార్పులు చేస్తూ కొత్త చట్టాలను ప్రకటించింది. ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లలో ఆఖరి నిమిషం వరకు డ్రామా కొనసాగేలా ఎంసీసీ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రీడాలోకంలో చర్చనీయాంశంగా మారింది. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటిదాకా ఒక ఆనవాయితీ ఉండేది. అదేంటంటే రోజు ఆట ముగిసే సమయానికి (చివరి ఓవర్లో) ఏదైనా వికెట్ పడితే, వెంటనే ఆ రోజు ఆటను ముగించేసేవారు. దీనివల్ల బ్యాటింగ్ చేసే జట్టుకు ఒక వెసులుబాటు ఉండేది. వారు మరుసటి రోజు ఉదయం తమ వ్యూహానికి తగ్గట్టుగా కొత్త బ్యాటర్‌ను పంపేవారు. కానీ, ఎంసీసీ కొత్త చట్టం 12.5.2 ప్రకారం.. ఇకపై చివరి ఓవర్లో వికెట్ పడినా సరే, ఆ ఓవర్ పూర్తి కావాల్సిందే. అంటే, కొత్త బ్యాటర్ వెంటనే క్రీజులోకి వచ్చి ఆ ఓవర్లో మిగిలిన బంతులను ఎదుర్కోవాలి. దీనివల్ల ఫీల్డింగ్ టీమ్‌కు బ్యాటర్‌పై ఒత్తిడి పెంచే అవకాశం దక్కుతుంది.

మహిళల క్రికెట్‌ను మరింత వేగవంతం చేసేందుకు ఎంసీసీ బంతి బరువు,సైజులో మార్పులు చేసింది. ఇప్పటివరకు మహిళల క్రికెట్‌లో బంతి బరువు 140 నుండి 151 గ్రాముల మధ్య ఉండేది. ఇప్పుడు దాన్ని 140 నుండి 149 గ్రాములకు తగ్గించారు. అలాగే బంతి పరిమాణం కూడా 21.5 నుండి 22 సెంటీమీటర్లుగా నిర్ణయించారు. దీనివల్ల బౌలర్లు మరింత వేగంతో బంతులు విసరడానికి, అలాగే బ్యాటర్లు భారీ షాట్లు కొట్టడానికి వీలవుతుందని భావిస్తున్నారు.

కేవలం అంతర్జాతీయ క్రికెట్ మాత్రమే కాకుండా, పునాది స్థాయి క్రికెట్‌లోనూ మార్పులు తెచ్చారు. అండర్-13 జూనియర్ క్రికెట్‌లో వాడే బంతి బరువును 140-144 గ్రాములుగా స్థిరీకరించారు. దీని సైజు కూడా 20.5 నుంచి 21 సెంటీమీటర్ల మధ్య ఉండేలా నిబంధనలు మార్చారు. వర్ధమాన క్రీడాకారులు సరైన బరువున్న బంతితో ప్రాక్టీస్ చేయడం వల్ల భవిష్యత్తులో వారు సీనియర్ లెవల్‌కు వెళ్ళినప్పుడు ఇబ్బంది పడకుండా ఉంటారని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయి?

ఈ కొత్త నిబంధనలు 2026 జనవరి నుంచి ప్రపంచవ్యాప్తంగా జరిగే అన్ని అధికారిక క్రికెట్ మ్యాచ్‌లకు వర్తిస్తాయి. దీనివల్ల టెస్ట్ క్రికెట్‌లో ఆఖరి ఓవర్లలో వికెట్ పడితే వచ్చే ఉత్కంఠ మరింత పెరుగుతుంది. ముఖ్యంగా డ్రా అయ్యే స్థితిలో ఉన్న మ్యాచ్‌లలో ఈ రూల్ గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశం ఉంది. ఎంసీసీ తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయం పట్ల మాజీ క్రికెటర్లు మరియు విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com